క్లుప్తంగా

శ్మశానవాటికకు స్థలం కేటాయించాలని వినతి



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

రఘునాథపాలెం: మండలకేంద్రమైన రఘునాథపాలెంలో మాదిగ, మాలలకు శ్మశానవాటిక లేక ఇబ్బంది పడుతున్నామని, తమకు సర్వే నంబర్ 218లో భూమిని కేటాయించాలని కోరుతూ బుధవారం ఎమ్మార్పీఎస్ నాయకులు కలెక్టర్ వీపీ గౌతమ్‌కు వినతి పత్రం అందించారు. గతంలో అనేక మందికి దరఖాస్తులు ఇచ్చినా.. ఇంతవరకు స్థలం కేటాయించలేదని వినతిలో పేర్కొన్నారు. ఈ విషయంపై ఇటీవల మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. వినతి అందించిన వారిలో ఎమ్మార్పీఎస్ నాయకులు గాజుల నరసింహారావు కృష్ణారావు, దాసరి వెంకటేశ్వర్లు, గాజుల ముత్తయ్య, తూరిగంటి సుందర్రావు తదితరులు ఉన్నారు.

దివ్యాంగులకు ట్రై సైకిళ్లు అందజేత



ట్రై సైకిళ్లు అందిస్తున్న డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ నాయకులు

రఘునాథపాలెం: మండలంలోని చిమ్మపుడికి చెందిన దివ్యాంగులు చాపల సైదులు, కణతాల సతీష్‌కు డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ నాయకుల సహకారంతో ట్రై సైకిళ్లు మంజూరయ్యాయి. వీరిద్దరు పడుతున్న ఇబ్బందులను గుర్తించిన నాయకులు దరఖాస్తు చేయించడమే కాక అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో ట్రై సైకిళ్లు మంజూరు చేయగా బుధవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు జోనెబోయిన నవీన్, దొంతు గణేష్, కుదురుపాక సాయికృష్ణ, పోతురాజు వేణు, చాపల వీరబాబు, శెట్టి నరేష్, సంపత్, చంద్రకాని మహేష్, అల్లం కరుణాకర్, కాముని అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

నేడు సీపీఆర్‌పై శిక్షణ

కామేపల్లి(కారేపల్లి): కామేపల్లి రైతువేదికలో గురువారం సీపీఆర్‌పై శిక్షణ నిర్వహిస్తున్నట్లు కామేపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి ఎస్.చందన తెలిపారు. ఎంపీపీ బానోత సునీత అధ్యక్షతన జరిగే ఈ కార్యక్రమానికి ఆశా కార్యకర్తలు, వైద్యసిబ్బంది, మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరు కావాలని కోరారు.

నేడు సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

ఖమ్మంమయూరిసెంటర్: లోక్‌సభా పక్ష నాయకుడు, ఖమ్మం ఎంపీ నామ నాగేశ్వరరావు సిఫారసుతో మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను గురువారం పంపిణీ చేయనున్నారు. ఖమ్మంలోని ఎంపీ క్యాంపు కార్యాలయంలో ఉదయం 10 గంటలకు చెక్కుల పంపిణీ ఉంటుందని కార్యాలయ వర్గాలు వెల్లడించారు. వివిధ నియోజకవర్గాల లబ్ధిదారులకు సకాలంలో హాజరుకావాలని వారు కోరారు.

నగరంలో సినిమాలు

తిరుమల	దసరా
వినోద	బలగం
సాయిరాం	ఆరెంజ్
ఆదిత్య	దసరా
శ్రీనివాస	దాస్ కా దమ్కి
సుందర్	రంగ మార్తాండ

- ఖమ్మంవ్యవసాయం

ఖమ్మం రైతుబజార్, సమీకృత మార్కెట్

కూరగాయలు కేజీ ధర (రూ.ల్లో)		ఆకుకూరల కట్టలు (రూ.ల్లో)	
టమాట	18	బచ్చలికూర	2
వంకాయ	30		10
బెండకాయ	36	పాలకూర	3
పచ్చిమిర్చి	34		10
కాకర	38	చుక్కకూర	2
సోరకాయ	16		10
బీర	56	తోటకూర	2
దొండ	30		10
పొట్లకాయ	30	గోంగూర	2
చిక్కుడు	70		10
గోరుచిక్కుడు	46	మెంతికూర	5
క్యాబేజీ	16		20
క్యాలీఫ్లవర్	25	కొత్తిమీర	1
ఆలుగడ్డ	20		15
చామగడ్డ	50	పుదీన	1
క్యారెట్	26		15
క్యాప్సికం	56	-ఖమ్మం వ్యవసాయం	

పేరుకే కమిటీలు..!



నేలకొండపల్లి ప్రభుత్వ ఆస్పత్రి

పరిష్కారానికి నోచుకోని సమస్యలు

- నిర్వహణలో కనిపించని ఫలితాలు
- నియామకాలకే పరిమితమైన వైనం
- సంతకాలతో సరిపెడుతున్న కమిటీ ప్రతినిధులు
- నిధులొచ్చినప్పుడే గుర్తుకొస్తున్న సమావేశాలు
- సర్కారు పథకాల అమలులో కొరవడిన పారదర్శకత

నేలకొండపల్లి: ప్రభుత్వం నుంచి వచ్చే పథకాలు, నిధులు ప్రజలందరికీ సక్రమంగా అందేలా చేయటంలో ఆయా కమిటీలు కీలక పాత్ర పోషించాల్సి ఉంటుంది. కాగా పాలేరు నియోజకవర్గంలో అవి నామమాత్రంగా మారాయి. అక్రమాలు జరగకుండా అధికారులు, ప్రజాప్రతినిధులు, తల్లిదండ్రులతో కలిసి ఏర్పాటు చేసిన కమిటీలు కాగితాలకే పరిమితమయ్యాయనే విమర్శ ఉంది. అక్కడక్కడా సమావేశాలు నిర్వహించి సంతాకాలతో సరిపెడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

నిధులొచ్చినప్పుడే సమావేశాలు..

ఆస్పత్రి అభివృద్ధి కమిటీలు కేవలం నిధులొచ్చినప్పుడు మాత్రమే సమావేశాలు నిర్వహిస్తున్న పరిస్థితి పాలేరు డివిజన్‌లో నెలకొంది. ముఖ్యంగా నేలకొండపల్లి మండల కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రానికి సుస్తి చేసినా పట్టించుకునే పాలకులు లేరు. కమిటీ ఉన్నా.. ఉపయోగం సున్నా అన్నట్లుగా ఉంది. ఈ కమిటీలో మండల స్థాయి అధికారులు ఉన్న ఫలితం లేదనే చెప్పాలి. ప్రతీ మూడు నెలలకోసారి సమావేశాలు నిర్వహించి, ఆస్పత్రి అభివృద్ధితో పాటు సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాల్సి ఉంది. కానీ ఇక్కడ అంతా ఉత్తుత్తి సమావేశాలు జరుగుతూ.. సంతకాలతో సరిపెడుతున్నారు.

నామమాత్రంగా పాఠశాలల పర్యవేక్షణ..

పాఠశాలల అభివృద్ధిలో యాజమాన్య కమిటీలది కీలక బాధ్యత. పాఠశాలల బలోపేతానికి, సమస్యల పరిష్కారానికి, ఉపాధ్యాయులు ఇష్టారాజ్యానికి అడ్డుకట్ట వేసేందుకు ప్రజల భాగస్వామ్యంతో ప్రభుత్వం కొన్నేళ్లుగా యాజమాన్య కమిటీలు నిర్వహిస్తోంది. ఇవి పేరుకే పరిమితమై.. సమావేశాలు నిర్వహణ గాలికొదిలేశారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. కేవలం అభివృద్ధి పనులకు నిధులొచ్చినప్పుడు మాత్రమే సంతకాల కోసం ఎస్ఎంసీ సభ్యులను పిలిపించి సంతకాలు తీసుకుంటున్నారు. అంతే కాకుండా పేరెంట్స్ కమిటీల పరిస్థితి కూడా అంతే మారింది.

అలంకార ప్రాయంగా అంగన్‌వాడీ కమిటీలు..

అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే పోషకాహారం అర్హులకు అందేలా చూడటం, లోపాలను గుర్తించి అవగాహన కల్పించేందుకు ప్రతీ గ్రామపంచాయతీ పరిధిలో సర్పంచ్ చైర్మన్‌గా, కమిటీలను ఏర్పాటు చేశారు. ఇందులో వార్డు సభ్యులతో పాటు మహిళలు, యువత, కిశోర బాలికలు సభ్యులుగా ఉంటారు. కాగా ఈ కమిటీలు ఉన్నట్లు చాలా చోట్ల చాలా మందికి తెలియదు.



సదాశివాపురం ప్రభుత్వ పాఠశాల

తొంగి చూడని కమిటీలు అనేకం..

ప్రభుత్వ చౌకదుకాణాల పర్యవేక్షణకు ఆహార సలహా సంఘాలు మండల, గ్రామ కమిటీలు ఉన్నాయి. ఈ సంఘాలు సైతం దుకాణాల వైపు తొంగిచూసే దాఖలాలే లేవని విమర్శలు ఉన్నాయి. ఇవే కాకుండా గ్రామాల్లో శాంతి, పారిశుద్ధ్య కమిటీలతో పాటు తదితర సంఘాలు అనేకం ఉన్నాయి. కానీ అవి ఎక్కడా పని చేయటం లేదు. ఇవి మనుగడలో ఉన్నా..ఎవరూ పట్టించుకోటం లేదు. కమిటీలో సభ్యులుగా ఉన్నామనే విషయం కొందరికి తెలియదంటే అతిశయోక్తి కాదేమో.

అధికారుల నిర్లక్ష్యమే కారణం..



మండలంలో ఏ కమిటీలు కూడా పూర్తిస్థాయిలో పని చేయటం లేదు. ఇందుకు ప్రధాన కారణం అధికార యంత్రాంగం నిర్లక్ష్యమే. కమిటీలు హడావుడిగా ఏర్పాటు చేసి చేతులు దులుపుకుంటున్నారు. జిల్లా యంత్రాంగం ఇప్పటికైనా చర్యలు తీసుకోవాలి. కమిటీలు వినియోగంలోకి రావాలి.

– బట్టపోతుల ప్రకాషం, నేలకొండపల్లి

పూర్తి అధికారాలు ఇవ్వాలి..



కమిటీలకు ప్రభుత్వం పూర్తి అధికారాలతో పాటు నిధులు కూడా అందిస్తే మంచిగా పని చేస్తాయి. ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకోవాలి. చాలా చోట్ల కమిటీలు ఉత్సవ విగ్రహాలుగా మారాయి. కమిటీల పర్యవేక్షణపై అధికారులు చర్యలు చేపట్టాలి.

– నున్నా రవికుమార్, మోటాపురం

సమావేశాలు నిర్వహిస్తున్నారు..



గ్రామాల్లో పాఠశాల విద్యా కమిటీ సమావేశాలు, సమయం ప్రకారం నిర్వహిస్తున్నాం. ఎక్కడైనా జరగకపోతే చర్యలు తీసుకుంటాం. మన ఊరు–మన బడి కార్యక్రమాలు ఎస్ఎంసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తూ వారికి అవగాహన కూడా కల్పిస్తున్నాం.

– బి.రాములు, ఎంఈఓ, నేలకొండపల్లి

విద్యార్థుల జీవితాలతో చెలగాటం



ఖమ్మంమయూరిసెంటర్: దిష్టిబొమ్మను దహనం చేస్తున్న పీడీఎస్‌యూ నాయకులు



కూసుమంచిలో దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్/ కూసుమంచి/ఖమ్మం మామిళ్లగూడెం: పదో తరగతి పరీక్షా పేపర్ లీకేజీకి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని పీవైఎల్, పీడీఎస్‌యూ, కాంగ్రెస్ పార్టీ నాయకులు బుధవారం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ప్రశ్నాపత్రాలు లీకేజీలను నిరసిస్తూ ఖమ్మంలోని సరితాక్లినిక్ సెంటర్‌తో పాటు కూసుమంచిలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దిష్టిబొమ్మలను దహనం చేశారు. పీడీఎస్‌యూ ఖమ్మం డివిజన్ కమిటీ ఆధ్వర్యాన ఉమెన్స్ కళాశాల ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పీవైఎల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోళ్ల లక్ష్మీనారాయణ, పీడీఎస్‌యూ రాష్ట్ర నాయకురాలు దీపిక, ఖమ్మం డివిజన్ అధ్యక్షుడు సతీష్, పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి గోకినేపల్లి మస్తాన్, కాంగ్రెస్ పార్టీ నాయకులు మాట్లాడుతూ.. పదో తరగతి హిందీ పేపర్ లీకేజీ ఘటనలో పోలీసులు అరెస్టు చేసిన శివగణేష్, ప్రశాంత్ ఇద్దరూ బీజేపీ, ఆర్ఎస్ఎస్‌కు సంబంధించిన వ్యక్తులు అని, వీరు బీజేపీ రాజకీయ లబ్ధి కోసం పేపర్‌ను లీక్ చేసి లక్షలాది మంది విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడడం దుర్మార్గం అన్నారు. లీకేజీ ఘటనపై సమగ్ర విచారణ జరిపి దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు గొర్రెపాటి రమేష్, ఉపేందర్, క్రాంతి, ఆర్కే, ప్రభు, గాంధీ, సర్వేందర్, చలపతి, కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎండీ హఫీజుద్దీన్, బాణోత్ వినోద, బెల్లంకొండ శరత్, పెండ్ర అంజయ్య, సూర్యనారాయణ రెడ్డి, కలీమ్, బెల్లి శ్రీశైలం, కొండా శ్రీనివాస్, డివిజన్ నాయకులు ఉష, సింధు, మహేశ్వరీ, అనూష, తదితరులు పాల్గొన్నారు.

వరద కాల్వ పరిశీలన



కాల్వను పరిశీలిస్తున్న ఇరిగేషన్ అధికారులు

తిరుమలాయపాలెం: బీరోలు రెవెన్యూ పరిధిలోని కల్వకుంట చెరువుకు తానంచర్ల వరద కాల్వ ద్వారా భక్త రామదాసు నీరు అందకపోవడంతో రైతుల విజ్ఞప్తి మేరకు బుధవారం ఇరిగేషన్ డీఈ బాణాల రమేష్‌రెడ్డి ఏఈ రామకృష్ణ పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానిక రైతులతో మాట్లాడి చెరువుకు నీరందించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

నేటి దిగ్బంధనానికి అందరూ సహకరించాలి

నేలకొండపల్లి: మండలంలోని తిరుమలాపురం గిరిజన రైతులకు న్యాయం చేయాలని కోరుతూ.. గురువారం నేలకొండపల్లి దిగ్బంధాన్ని నిర్వహిస్తున్నట్లు గిరిజన బాధిత రైతులు భూక్యా రవికుమార్, రంజిత్‌లు ప్రకటించారు. బుధవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. తిరుమలాపురంకు చెందిన గిరిజన భూములను సాగు చేయకుండా కొంత మంది ఫెన్సింగ్ వేసి రహదారిని మూసేశారని.. ఈవిషయమై అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేయగా విచారణ కూడా చేయించారని చెప్పారు. కానీ గత రెండేళ్ల నుంచి రహదారి సౌకర్యం లేక బీడు భూములుగా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు. 33 అడుగుల దారి ఇవ్వాలని, 4 ఎకరాల గ్రామ కంఠంను స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేశారు. పాత నక్షా ప్రకారం రహదారి సౌకర్యం కల్పించాలని కోరారు. తాము చేపట్టే దిగ్బంధానికి రాజకీయాలకు అతీతంగా అందరూ సహకరించాలని కోరారు. చావో దారో తెల్చుకుంటామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో బాధిత రైతులు పాల్గొన్నారు.

ఢిల్లీ ర్యాలీలో జిల్లా నాయకులు



మాట్లాడుతున్న నారాయణవరపు శ్రీనివాస్

ఖమ్మంమయూరిసెంటర్: కేంద్రంలోని బీజేపీ సర్కారు అనుసరిస్తున్న కార్మిక, కర్షక విధానానికి వ్యతిరేకంగా రైతులు, వ్యవసాయ కూలీలు, కార్మికులు చేపట్టిన చలో ఢిల్లీ కార్యక్రమానికి ఖమ్మం జిల్లా నుంచి పలువురు నేతలు హాజరయ్యారు. తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పోతినేని సుదర్శన్‌తో కలిసి ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో జరిగిన భారీ బహిరంగ సభలో పలు సంఘాలకు చెందిన నాయకులు వై.విక్రమ్, షేక్ మీరాసాహెబ్, జబ్బార్, ఎస్.నవీన్‌రెడ్డి, కుమార్, అంబటి సుధాకర్, మోటమరి జగన్ మోహన్‌రావు, కాంపాటి వెంకన్న కేవీ.రెడ్డి తదితర నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దేశ సంస్థల పరిరక్షణ, కనీస మద్దతు ధర, విద్యుత్ సంపదను కార్పొరేట్లకు కట్టబెట్టే చట్టానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున కార్మిక హక్కులు కదిలి వచ్చారన్నారు.

'చలో ఢిల్లీ' విజయవంతం..

ఖమ్మం మామిళ్లగూడెం: బీసీల సమస్యలు పరిష్కరించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యాన ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, ఎంపీ, ఆర్.కృష్ణయ్య ఆధ్వర్యంలో చేపట్టిన చలో ఢిల్లీ మహాధర్నా విజయవంతం పట్ల ఆ సంఘ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. బుధవారం సంఘ కార్యాలయంలో జరిగిన సమావేశంలో జిల్లా అధ్యక్షుడు నారాయణవరపు శ్రీనివాస్ మాట్లాడారు. ఈ సమావేశంలో సంఘ రాష్ట్ర కార్యదర్శి మోడేపల్లి కృష్ణమాచారి, విద్యార్థి సంఘం జాతీయ అధ్యక్షుడు కృష్ణమచారి, డాక్టర్ గుండు హరికిషోర్ గౌడ్, జిల్లా అధికార ప్రతినిధి వెంకటేశ్వరావు, కార్యదర్శి రామకృష్ణ, సాయి, నాగేశ్వరావు, మాధవ పాల్గొన్నారు.

'బీఆర్ఎస్‌కు బీజేపీ భయం పట్టుకుంది'



రవికుమార్‌ను గృహ నిర్బంధం చేసిన పోలీసులు

నేలకొండపల్లి: బీఆర్ఎస్‌కు బీజేపీ భయం పట్టుకుందని ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి నున్నా రవికుమార్ ఆరోపించారు. మండలంలోని మోటాపురంలో బుధవారం పోలీసులు బీజేపీ నాయకులను గృహ నిర్బంధం చేసిన సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. అక్రమ అరెస్ట్‌లో ప్రభుత్వ లోపాలను దాచలేరని అన్నారు. పేపర్ల లీకేజీలను అరికట్టలేక పోరాటాలు చేస్తున్న వారిని అరెస్ట్ చేయటం సిగ్గుచేటు అన్నారు. పోలీసులు కేసీఆర్ కుటుంబానికి బానిసలుగా పని చేస్తున్నారని ఆరోపించారు. కేసీఆర్ నియంత పాలనకు నిదర్శనం బండి సంజయ్ అరెస్ట్ పేర్కొన్నారు. లిక్కర్ అవినీతికి పాల్పడిన వారిని పట్టించుకోని పోలీసులు, ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా సంజయ్‌ను అరెస్ట్ చేయటం ఎంత వరకు సబబు అని ప్రశ్నించారు. ప్రతిపక్షాల గొంతు నొక్కాలని చూస్తున్న కేసీఆర్ పాలనకు చరమగీతం తప్పదని హెచ్చరించారు. గృహ నిర్బంధాలు చేసిన బీజేపీ నాయకులను బేషరతుగా విడుదల చేయాలని కోరారు.

బీజేపీ నాయకుల అరెస్ట్..

కామేపల్లి(కారేపల్లి)/ఖమ్మంమామిళ్లగూడెం/ఖమ్మంఅర్బన్: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌ను అరెస్ట్‌ను నిరసిస్తూ.. బుధవారం కామేపల్లిలో బీజేపీ నాయకులు ధర్నాకు దిగారు. ఈ క్రమంలో కామేపల్లి పోలీసులు వారిని అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అదే విధంగా ఖమ్మం ఎన్టీఆర్ సర్కిల్ సెంటర్‌లో బీజేపీ జిల్లా కమిటీ ఆధ్వర్యాన రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు దొడ్డా అరుణ, అనిత తదితరులను అరెస్టు చేసి టూటౌన్ పోలీసు స్టేషన్‌కు తరలించారు. అర్బన్ నాయకుడు సురేష్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి శ్యాంరాథోడ్, బీజేపీ నాయకులు భూక్యా శ్రీను, పోలూరి రామచంద్రయ్య, భాగం రంగారావు, అల్లిక అంజయ్య, విజయరెడ్డి పాల్గొన్నారు.

మతోన్మాద రాజకీయాలను తరిమికొట్టాలి



ఆరేకోడులో మాట్లాడుతున్న దండి సురేష్

ఖమ్మంరూరల్: బీజేపీ మతోన్మాద రాజకీయాలను సీపీఐ కార్యకర్తలు తరిమి కొట్టాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్ పిలుపునిచ్చారు. బుధవారం మండలంలోని ఆరేకోడు, ఆరేకోడుతండా, తీర్థాల, ఏదులాపురం, గుండాలతండా గ్రామ శాఖ సమావేశాల్లో ఆయన మాట్లాడారు. అన్ని కులాలు, మతాలకు నిలయమైన భారతదేశంలో బీజేపీ మాటున ఆర్ఎస్ఎస్ భావజాలాన్ని వ్యాప్తి చేసే కుట్రలు పన్నుతున్నారని విమర్శించారు. ఇప్పటికే ఆ దిశగా చర్యలు చేపట్టి ప్రజల మధ్య చిచ్చు పెడుతూ దళితులు, కమ్యూనిస్టులపై దాడికి ఉసిగొల్పుతున్నారని తెలిపారు. ప్రధాని మోదీ కేవలం కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేస్తూ కార్మికుల హక్కులను కాలరాస్తున్నారని, అందులో భాగంగానే ప్రభుత్వరంగ సంస్థలను చౌకబారుగా వారికి కట్టబెడుతున్నారని పేర్కొన్నారు. ప్రజలు బీజేపీని నిలువరించడాన్ని ఓ ఉద్యమంలా తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సీపీఐ నాయకులు మిడకంటి చినవెంకటరెడ్డి, శంకరయ్య, చెరుకుపల్లి భాస్కర్‌రావు, రామిడి రమేష్, ఎం.వీరబాబు, శివ, గణేష్, రామయ్య తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌టీపీ కేఎంసీ అధ్యక్షుడిగా అప్పిరెడ్డి

ఖమ్మంమయూరిసెంటర్: వైఎస్సార్ తెలంగాణ పార్టీ మున్సిపల్ కార్పొరేషన్‌ల అధ్యక్షులను ఆ పార్టీ అధినేత్రి వైఎస్ షర్మిల నియమించారు. పార్టీ ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ అధ్యక్షుడిగా తుమ్మ అప్పిరెడ్డిని నియమించారు. ఈ సందర్భంగా అప్పిరెడ్డి మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో తనకు అప్పగించిన బాధ్యతలను నిర్వహిస్తూ పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు.

మిద్దెతోటల సందర్శన

ఖమ్మం సహకారనగర్: నగరంలోని శ్రీనివాసనగర్‌లో గల గీతాంజలి పాఠశాల డైరెక్టర్స్ టీవీ అప్పారావు, టి.పద్మల ఇంటిపై ఏర్పాటు చేసిన మిద్దె తోటను కేఎంసీ మేయర్ పునుకొల్లు నీరజ, సుడా చైర్మన్ బచ్చు విజయ్‌కుమార్‌లు బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి కుటుంబం రసాయనాలు వాడని ఆర్గానిక్ మిద్దెతోటలను ఏర్పాటు చేసి వివిధ రకాల కూరగాయలు, ఆకుకూరలు, పండ్లు పండించాలని కోరారు. కార్యక్రమంలో డైరెక్టర్ టి.అరుణ్, ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర సిబ్బంది పాల్గొన్నారు.

తమ్మినేని పరామర్శ

ఖమ్మంరూరల్: మండలంలోని తనగంపాడుకు చెందిన సీపీఎం నాయకుడు సీహెచ్. బాలరాజు గత కొన్ని రోజుల క్రితం విద్యుత్‌షాక్‌కు గురై ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు బుధవారం ఆస్పత్రికి వెళ్లి పరామర్శించారు. వారి వెంట నండ్ర ప్రసాద్, నాగులు, ఉద్దండు సాహెబ్, నాగేశ్వరరావు తదితరులు ఉన్నారు.

వృద్ధురాలి మృతదేహానికి అంత్యక్రియలు

నేలకొండపల్లి: మండల కేంద్రానికి చెందిన ఓ వృద్ధురాలు మృతి చెందగా.. పంచాయతీ కార్యాలయం సిబ్బంది ఆమె అంత్యక్రియలు నిర్వహించారు. వివరాలిలా ఉన్నాయి. నేలకొండపల్లికి చెందిన మేడి ముత్తమ్మ(80) గత నాలుగు రోజులుగా అస్వస్థతకు గురై బుధవారం మృతి చెందింది. కుటుంబ సభ్యులు ఎవరూ లేకపోవటంతో సర్పంచ్ రాయపూడి నవీన్ స్పందించి పంచాయతీ సిబ్బంది ద్వారా అంత్యక్రియలు నిర్వహించారు.

ఘనంగా జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలు

దేశ ఉప ప్రధాని డాక్టర్ బాబూ జగ్జీవన్ రామ్ 116వ జయంతిని పురస్కరించుకొని బుధవారం మండలాల్లోని ప్రభుత్వ, ప్రైవేట్, పార్టీ కార్యాలయాల్లో వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జగ్జీవన్ రామ్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన దేశానికి అందించిన సేవలను పలువురు నాయకులు కొనియాడారు. – సాక్షి నెట్‌వర్క్



కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పూలమాల వేస్తున్న పువ్వాళ్ళ దుర్గాప్రసాద్, తదితరులు



ఖమ్మంమయూరిసెంటర్: మంత్రి క్యాంపు కార్యాలయంలో జయంతి వేడుకలు



ఖమ్మం మామిళ్లగూడెం: మాదిగ హక్కుల దండోరా ఆధ్వర్యంలో..



తిరుమలాయపాలెం: పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు



కామేపల్లి మండలం మద్దులపల్లిలో..



నేలకొండపల్లి: నివాళులర్పిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు



ఖమ్మంరూరల్ మండల పరిషత్ కార్యాలయంలో నివాళులర్పిస్తున్న నాయకులు



రఘునాథపాలెంలో నివాళులర్పిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు



పూలమాల వేసి నివాళులర్పిస్తున్న టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు అఫ్జల్‌హసన్



ఖమ్మం వైరారోడ్ బీఆర్ఎస్ కార్యాలయంలో.. నివాళులర్పిస్తున్న నాయకులు



కూసుమంచి: వేడుకల్లో పాల్గొన్న నాయకులు